ప్రాణాలకు రక్ష హెల్మెట్



పార్లపలి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాహనదారులు (ఫైల్)



- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు
- వాహన రిజిస్ట్రేషన్‌కు హెల్మెట్‌తో లింక్
- నూతన చట్టం అమలుకు అధికారుల చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: నేటి యువత త్వరగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో బైక్‌లలో అతివేగంతో వెళుతున్నారు. దీనికి తోడు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల బారిన పడి కుటుంబ సభ్యులకు తీరని దుఃఖం కలిగిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేదు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా వాహనాల రిజిస్ట్రేషన్‌కు హెల్మెట్‌కు లింకు చేశారు. కొత్త వాహనం కొనుగోలు చేసిన సమయంలోనే హెల్మెట్ తీసుకోవాలనే షరతు విధించారు. హెల్మెట్ ఉంటేనే వాహనం రిజిస్ట్రేషన్ చేస్తామని రవాణాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. రవాణాశాఖ కార్యాలయానికి వచ్చే వాహన యజమాని కొత్త హెల్మెట్‌ను, దాని బిల్లును సమర్పిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించారు.

మోటారు వెహికల్ చట్టం–138(ఎఫ్) ప్రకారం వాహనాలు విక్రయించే డీలర్లు విధిగా హెల్మెట్‌ను అందుబాటులో ఉంచాలి. వాహన చోదకులు ఆసక్తి చూపనందున ఎవరూ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. డీలర్లు హెల్మెట్‌లు తప్పనిసరి చేస్తున్నా వాహన చోదకులు మాత్రం ఇంట్లోనే హెల్మెట్‌లు పెట్టి వాహనాలను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో సత్యవేడు నియోజకవర్గంలోని బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, కేవీబీపురం, పిచ్చాటూరు, నారాయణవనం, నాగలాపురం మండలాల్లో ఇప్పటికే పోలీసు అధికారులు హెల్మెట్ వాడకంపై క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు.

129 సెక్షన్ ప్రకారం..

మోటారు వాహన చట్టంలోని 129 సెక్షన్ ప్రకారం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఈ నిబంధనలు ఎప్పటి నుంచో అమల్లో ఉన్నా... ఆచరణకు నోచుకోలేదు. ఈ విషయంపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీ చేయడంతో దేశం దృష్టి హెల్మెట్ వినియోగం పైమళ్లింది. రోజు రోజుకు పెరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని నిబంధనలు అమలు చేస్తున్నారు. పోలీసులు దీని కోసం ప్రత్యేక తనిఖీలు కూడా చేపడుతున్నారు. దీని కోసం అధిక జరిమానాలను కూడా విధిస్తున్నారు. కనీసం ఆ భయంతోనైనా హెల్మెట్ అలవాటు చేసుకుంటారని అధికారులు భావిస్తున్నారు.

నాణ్యత లేని హెల్మెట్ వద్దు

పోలీసు కేసులను తప్పించుకునేందుకు నాణ్యత లేని హెల్మెట్‌లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రయోజనం ఉండదని అధికారులు చెబుతున్నారు. ఫుట్‌పాత్‌లపై లభించే హెల్మెట్‌ల వల్ల ధరలు తగ్గుతాయి. కానీ ప్రాణ రక్షణకు గ్యారెంటీ ఉండదని పేర్కొంటున్నారు. చిన్నచిన్న ప్రమాదాల్లో వాహన చోదకులు కింద పడితే హెల్మెట్ పగలి వాటి వలన కూడా గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి.

హెల్మెట్ లేకపోవడంతోనే...

జులై నెల 11 వ తేదీన మండలంలోని ఆలత్తూరు గ్రామంలో శ్రీనిధిరాజా పరిశ్రమలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి నుండి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. వీరు పార్లపల్లి గ్రామ సమీపంలో బుచ్చినాయుడుకండ్రిగ నుండి శ్రీకాళహస్తికి వెళ్తున్న కారు ఢీ కొట్టారు. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బాపూన్‌సింగ్ (22), రాజాసింగ్ (22), సుఖ్‌దేవ్‌సింగ్ (22)లు హెల్మెట్ లేకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వీరు హెల్మెట్ ధరించి ఉంటే స్వల్ప గాయాలై ఉండేవి. వీరి మృతితో కుటుంబ సభ్యులు వీధిన పడ్డారు. అదే విధంగా మండలంలోని కేటీరోడ్డుపై నిత్యం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవటంతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. లేని పక్షంలో మొదటిసారి అపరాధ రుసుం విధిస్తాం. రెండోసారి, మూడో సారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. కేసులు కూడా నమోదు చేస్తాం. మనిషికి ప్రాణం కన్నా ఏదీ ముఖ్యం కాదు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి తప్పించుకోవాలి.

– విశ్వనాథనాయుడు, ఎస్‌ఐ, బుచ్చినాయుడుకండ్రిగ

విస్తృత ప్రచారం అవసరం

- హెల్మెట్ వాడకంపై కరపత్రాలు పంచడంతో పాటు ఫ్లెక్సీలు, బ్యానర్లు, ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా ఆయా సంస్థలు కఠిన చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలలు, కళాశాలల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించాలి.
- హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులకు నోటీసులు జారీ చేయాలి.
- పట్టుబడితే తొలిసారి కౌన్సెలింగ్ చేసి వదలిపెట్టాలి. పునరావృతమైతే భారీ జరినామా విధించేలా పోలీసులు చొరవ చూపాలి.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు (ఫైల్)

క్లుప్తంగా

అంగన్‌వాడీలలో వసతుల కల్పన

సాక్షి ఎఫెక్ట్..

నారాయణవనం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తామని సూపర్‌వైజర్ బేబీ తెలిపారు. 'అంగన్ బేడీలు' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్పందించారు. నారాయణవనంలో రేకుల షెడ్లలో నడుస్తున్న కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పది రోజుల్లో సౌకర్యాలు ఉన్న అద్దె భవనాల్లోకి కేంద్రాలను మారుస్తామని అన్నారు. కాంట్రాక్టర్‌కు పూర్తి చేసిన పనులకు బిల్లులు అందాయని పేర్కొన్నారు. నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరలో కేంద్రాన్ని నడపడానికి కృషి చేస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది

శ్రీకాళహస్తి: జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఉప కారాగారంలో న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఉచిత న్యాయం గురించి ఖైదీలకు వివరించారు. న్యాయవాదులు మాట్లాడుతూ జైలు అనేది మారడానికి ఒక పునరావాస కేంద్రమని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, శ్రీరామ సింధు, పారా లీగల్ వలంటీర్లు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే తల్లి



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో తెలుగుగంగ వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తల్లి బొజ్జల బృందమ్మ, ఎమ్మెల్యే సతీమణి రిషితా రెడ్డితో కలిసి శనివారం రాత్రి తనిఖీ నిర్వహించారు. మరుగుదొడ్డిలో సరిపడినంత నీళ్లు లేవని, లైటింగ్ సరిగా లేదని సీసీ కెమెరాలు లేవని తెలిపారు. వెంటనే వాటని పునరుద్ధరించాలని చెప్పారు. అనంతరం వంటశాలలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన భోజనం నాణ్యత బాగా లేదని, ఇదిలా కొనసాగితే కాంట్రాక్టర్‌ను మారుస్తామంటూ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అయితే కాంట్రాక్టరుగా టీడీపీకి చెందిన నాయకుడే కూరగాయలు, పండ్లు సరఫరా చేస్తున్నాడు. బియ్యం ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. ఏ కాంట్రాక్టర్‌ను సస్పెండ్ చేస్తారో ప్రకటించలేదు. గతంలో గురుకుల పాఠశాలలో ప్రవేశించాలంటే కలెక్టర్ అనుమతి లేనిదే కుదరదని అక్కడి వార్డెన్ తెలిపారు. అయితే శనివారం పదిమంది టీడీపీ నాయకులతో బొజ్జల బృందమ్మ, రిషితారెడ్డి తనిఖీ చేశారు. సాధారణంగా పురుషులను ఎవరినీ లోపలకు తీసుకుపోకూడదని నిబంధన ఉన్నప్పటికీ ఉల్లంఘించి పలువురు నాయకులు లోపలకు వెళ్లడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ

నాగలాపురం: వైఎస్ఆర్ సీపీ నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు సతీమణి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో గూడూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి శనివారం గూడూరులో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించారు. వైద్యం అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జిల్లా కార్మిక విభాగం మాజీ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, నాగలాపురం నాయకులు చిన్నదొరై, ధనరాజ్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఘట్కా పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి ఘట్కా పోటీలను ప్రారంభిస్తున్న విశ్వనాథనాయక్

రేణిగుంట : రేణిగుంట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం రాష్ట్ర స్థాయి ఘట్కా పోటీలు ప్రారంభమయ్యాయి. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు జరగనున్న పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల్లోని 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను తిరుపతి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి విశ్వనాథనాయక్ ప్రారంభించారు. అండర్ –17, అండర్ –19 బాల, బాలికలు విభాగాల్లో పోటీలు శనివారం రసవత్తరంగా జరిగాయి. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ బాలశేఖర్, హైస్కూల్ హెచ్‌ఎం విష్ణువర్ధనం, జిల్లా ఘట్కా సెక్రటరీ సురేంద్రరెడ్డి, జాయింట్ సెక్రటరీ సురేష్, పీడీ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



గురువారెడ్డి, రామకృష్ణయ్య, శాంతి

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం ఆమందూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన మండల యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో యూనియన్ మండల స్థాయి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఓ.విజయకుమార్ వ్యవహరించారు. యూని యన్ మండల అధ్యక్షులుగా సి.గురవారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.రామకృష్ణయ్య, గౌరవ అధ్యక్షులుగా ఎం.భక్తవత్సలం, సహాధ్యక్షులుగా ఎన్.మునిరత్నం, ఎం.ఉష, ఆర్థిక కార్యదర్శిగా ఎం.ఎం. శాంతి, జిల్లా కౌన్సిలర్లుగా ఎ.నాగరాజు, జి.సుధాకర్, జి.సీతాపతి, ఎ.హరినాథ్ బాబు, ఎం.పద్మ, వై.గురవారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, యూటీఎఫ్ లక్ష్యాల కోసం నూతన కమిటీ పని చేస్తుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి మోహన్ బాబు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శివకుమార్, కుటుంబ సంక్షేమ సంఘం డైరెక్టర్ హేమాంబరధర రావు, సీనియర్ నాయకులు రాజవేలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంకర క్వారీల పరిశీలన

సత్యవేడు: మండల పరిధిలోని చమర్తికండ్రిగలో ఉన్న పలు కంకర క్వారీలను జిల్లా మైనింగ్ శాఖ అధికారులు పరిశీలించారు. జిల్లా మైనింగ్ ఏడీ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు సెవెన్ హిల్స్, ఎస్ఎల్బీ దామోదరం తదితర కంకర క్వారీలను పరిశీలంచారు. పభుత్వానికి చెల్లిస్తున్న లాయల్టీలో భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వే బిల్లుల్లో వ్యత్యాసాలు, ఇతర లోపాలు ఉండడంతో రెండు క్వారీల మూసి వేతకు చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం.

యంత్రాలతో వరినాట్లు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని రైతులు యంత్రాలతో విస్తారంగా వరినాట్లు వేస్తున్నారు. గ్రామంలో సుమారు 150 ఎకరాల్లో వరిపంటను రైతులు సాగు చేస్తున్నారు. గతంలో మహిళలతో వరినాటు వేయించేవారు. దీంతో పంటకు ఖర్చు పెరిగిపోతుండడంతో యంత్రంతో వరినాట్లుపై మక్కువ చూపుతున్నారు. యంత్రంతో వరినాట్లు వేయడంతో కూలీలతో పనిలేకుండా పోతుందని రైతులు అంటున్నారు.

దందోలు భక్తవత్సలరెడ్డికి నివాళి



భక్తవత్సలరెడ్డికి నివాళులర్పిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: టీడీపీ సీనియర్ నాయకులు తొండామనుపురం గ్రామానికి చెందిన దందోలు భక్తవత్సల రెడ్డి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాక్ ఆపరేషన్

రేణిగుంట: ఆక్టోపస్, పోలీస్ దళాలు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో మాక్ ఆపరేషన్ నిర్వహించారు. ఆక్టోపస్ దళాలు మాక్ ఆపరేషన్లో భాగంగా విమానాశ్రయంలో ఎదైనా అవాంఛనీయ ఘటనలు, ఉగ్రమూకల దాడికి పాల్పడితే సిబ్బంది, ప్రయాణికులు, సందర్శకులు ఎంత అప్రమత్తంగా వ్యవహరించాలో ప్రయోగాత్మకంగా చేసి చూపారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు, ఫైర్ సర్వీసు, వైద్య ఆరోగ్య సిబ్బంది కలసి సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు తారసపడితే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పక్కదారి పట్టిన పీఎఫ్ నిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో మ్యాన్ పవర్ ఏజెన్సీ చేపడుతున్న వీపీజీ సంస్థ తమ పీఎఫ్ నిధులను పక్కదారి పట్టించిందని కార్మికులు వాపోయారు. వారు శనివారం సాయంత్రం శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత సంస్థ కొద్ది రోజులుగా సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, తమ జీతాల నుంచి కట్ చేసిన మొత్తాన్ని పక్కదారి పట్టించినట్టు పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి సంబంధిత సంస్థపై చర్యలు తీసుకుంటామని సీఐ బీవీ శ్రీనివాసులు తెలిపారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గంగమ్మా.. మన్నించు తల్లీ!



అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: దేశంలో ఎక్కడా లేనివిధంగా శ్రీకాళహస్తిలో మాత్రమే అరుదైన అదృష్టం ఏడు గంగమ్మల జాతర జరుగుతుందని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఏడుగంగమ్మలు కొలువైన ఆలయాన్ని గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అభివృద్ధి చేశారని చెప్పారు. ఆయన చొరవ తీసుకుని రూ.45లక్షలు కేటాయించి అధునాతన ఆలయాన్ని నిర్మించడానికి అంకురార్పణ చేసినట్లు గుర్తుచేశారు. నిర్మాణం పూర్తయిన తరువాత కలశస్థాపన, కుంభాభిషేకం అమ్మవారి స్థాపన కార్యక్రమాలు మూడు రోజులుగా జరుగుతున్నాయని తెలిపారు. అయితే శుక్రవారం నాటికి కుంభాభిషేకం పూజలన్నీ పూర్తయ్యాయి. సాయంత్రం అమ్మవారికి దీపాలు పెట్టాల్సి ఉండగా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం దర్శనం కోసం ఆలయానికి వెళ్లగా గుడి తలుపులు కూడా తెరవకపోవడం ఆవేదన కలిగిచిందన్నారు. ఏదైనా గుడికి కుంభాభిషేకం నిర్వహిస్తే 41రోజులపాటు అభిషేకాలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు చేయడం ఆనవాయితీ అని చెప్పారు. అయితే ఆ నియమాలను తుంగలో తొక్కి ఆలయాన్ని పట్టించుకోకుండా గాలికి వదిలేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆలయ అధికారులు, ప్రధాన అర్చకుడు, ఉప ప్రధాన అర్చకుడు పట్టించుకోకపోవడంపై బాధ కలిగించిందన్నారు. ఆలయ ఈవో బాపిరెడ్డికి దీనిపై అవగాహన ఉందా లేదా అని ప్రశ్నించారు. అపరాధం జరిగినా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయన్నారు. వెంటనే ఆలయానికి పూజారిని ఏర్పాటు చేసి అమ్మవారికి అభిషేక, నైవేద్యపూజలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేని పక్షంలో స్థానిక మహిళలతో ఆలయానికి వచ్చి అభిషేకం చేస్తామని హెచ్చరించారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడిన విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో అమ్మవారికి అభిషేకం చేయడం గమనార్హం.

ఇద్దరికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



తీగల ఆనంద్, సుబ్రమణ్యం

రేణిగుంట : ఏర్పేడు మండలంలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. మండలంలోని పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీగల ఆనంద్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు, బండారుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.సుబ్రమణ్యం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర విద్యాశాఖ ఎంపిక చేసింది. వీరు 11వ తేదీన విజయవాడలోని లబ్బీపేట ఏ- కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న అవార్డు ప్రదానోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకోనున్నారు.

పాఠశాల అభివృద్ధికి హెచ్ఎం కృషి

తీగల ఆనంద్ పని చేసిన ప్రతి చోట పాఠశాల అభివృద్ధికి అంకితభావంతో దాతల సహకారంతో విద్యార్థులకు వసతులను సమకూర్చడంతో ఎంతో పేరు సంపాదించుకున్నారు. హెచ్ఎంగా పని చేస్తూ పాఠశాల, విద్యార్థుల ఉన్నతికి విశేష సేవలు అందిస్తున్న ఆయన్ను అవార్డు వరించింది. ఎం.సుబ్రమణ్యం సర్వశిక్ష అభియాన్, నిష్టా, దీక్ష కార్యక్రమాలకు స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా, విద్యామృతం జిల్లా కో-ఆర్డినేటర్‌గా ఆంగ్ల సబ్జెక్టుపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విజయవంతంగా ప్రోగ్రాంలు చేశారు. ఆయన ఇంగ్లీష్ సబ్జెక్టులో బండారుపల్లి హైస్కూల్లో పదేళ్లుగా టెన్త్ విద్యార్థులు 100శాతం ఫలితాల సాధనలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయనకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేశారు.

క్రీడలతో శారీరక ఎదుగుదల

వరదయ్యపాళెం: విద్యార్థుల్లో శారీరక, మానసిక స్థితిగతులు పెంపొందించేందుకు క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రజాప్రగతి ట్రస్టు కో-ఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులకు వరదయ్యపాళెం హైస్కూల్ క్రీడా మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, పీడీ బందిల కుమార్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలురకు వాలీబాల్, బాలికలకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీలలో అండర్-17 వాలీబాల్‌లో వరదయ్యపాళెం హైస్కూల్ విజయం సాధించగా, బత్తలవల్లం హైస్కూల్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో గోవర్ధనపురం హైస్కూల్ విజయం సాధించగా, పాందూరు హైస్కూల్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా క్రీడా పోటీలను నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. విజయం సాధించిన వారికి చిల్డ్రన్స్ డే రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎల్‌పీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చెంచురామిరెడ్డి, మునిరాజ, వేణు, గంగయ్య, ఈశ్వరయ్య, అన్ని పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల ప్రారంభం



అండర్-17 బాలికల కబడ్డీ పోటీలు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్, హాజరైన ఇంజినీరింగ్ విద్యార్థులు

నారాయణవనం: సైబర్ నేరాలు, నకిలీ లోన్ యాప్‌లపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సైబర్ క్రైమ్ పరిశోధన నిపుణులు నరసింహారావు పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ రూపంలోనే ఎక్కువ మోసాలు జరుగుతాయన్నారు. ముఖ్యంగా మహిళలను టార్గెట్ చేస్తూ మోసాలు జరుగుతోందన్నారు. మోసపోయిన బాధితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న తిరుపతి జిల్లా ప్రజలే కాకుండా తిరుపతికి వచ్చే భక్తులు మొబైల్ హంట్ అప్లికేషన్‌ను ఉపయోగించుకొవచ్చునని అన్నారు. 9490617873 వాట్సాప్ నెంబర్ ద్వారా హాయ్ అని మెసేజ్‌తో వచ్చే గూగుల్ అప్లికేషన్ ఫామ్‌తో ఆన్‌లైన్ ఫిర్యాదులను స్వీకరించి పోయిన మొబైల్‌ను రికవరీ చేసి అందిస్తామని అన్నారు. ఈకేవైసీ, ఆధార్ అప్డేట్, బ్యాంకు పేరుతో కాల్ చేసే అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. బ్యాక్ డోర్ ద్వారా ఉద్యోగం అంటూ నకిలీ ఫోన్ కాల్స్‌కు, ఈమెయిల్స్‌కు రిప్లై ఇవ్వవద్దని అన్నారు. నరసింహారావు మాట్లాడుతూ సైబర్‌క్రైమ్‌పై అవగాహన లేక నేరగాళ్ల చేత మోసపోతున్నారని అన్నారు. ఈజీ మనీకి అలవాటున సైబర్ నిపుణులు అమాయకుల నుండి దోచుకుంటున్నారని అన్నారు. నేరాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు వారోత్సవాలను చేపట్టారని అన్నారు. సదస్సులో సీఐలు సురేంద్ర నాయుడు (పుత్తూరు అర్బన్), రవీంద్ర (పుత్తూరు రూరల్), ఎస్ఐలు రాజశేఖర్, (నారాయణవనం) వెంకటేశ్వర్లు (పిచ్చాటూరు), సైబర్ ల్యాబ్ సిబ్బంది, సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.